క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



కేటీదొడ్డి: మండలంలోని తోటతండా, పూజారి తండా పాఠశాలలను గురువారం ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ యుగంధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భవానీమాత ఉత్సవాలకు దాతల విరాళం




గట్టు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న భవానీమాత ఉత్సవాలు, రథోత్సవానికి హాజరైన వివిధ ప్రాంతాలకు చెందిన సోమవంశ సహస్రార్జున క్షత్రియ సంఘం (ఎస్‌ఎస్‌కే) వారు ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యుడు రాంప్రసాద్, జీతూరి రవి రూ.61,020 లు, గద్వాల ఎస్‌ఎస్‌కే సమాజ్‌కు చెందిన అశోక్, కాటేగారి అంబుసాలు రూ.7,016, రాజోలి ఎస్‌ఎస్‌కే సమాజ్ రామకృష్ణ, గుండప్ప, యూత్ సభ్యులు రూ.10,016, నంద్యాలకు చెందిన సిరిగిరి గోపాల్, మురళీ రూ.25,150, శాంతినగర్ ఎస్‌ఎస్‌కే సమాజ్ సభ్యులు రూ.5,116, సంగారెడ్డి ఎస్‌ఎస్‌కే సమాజ్ బసోది దేవయ్య, కపిలేష్ రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో గట్టు ఎస్‌ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, సంఘం సభ్యులు వీరన్న, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంటగదులు శుభ్రంగా ఉంచాలి



గట్టు: పాఠశాలల్లోని వంట గదులు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని ఎంఈఓ నల్లారెడ్డి హెడ్మాస్టర్లకు సూచించారు. గురువారం అంతంపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నల్లారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, వంట గది శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని వంట ఏజెన్సీలకు సూచించారు. పాఠశాల ఆవరణలో కూరగాయల గార్డెన్‌ను పరిశీలించారు. ఎంపీఎఫ్ నెమలిక బుక్‌లను చదివించి, రెమిడియల్‌ను పరిశీలించారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక



గట్టు: మండల కేంద్రానికి చెందిన లైన్‌మెన్ బొజ్జయ్య కోడలు సందెపోగు అభిజ్ఞ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైంది. గురువారం రాత్రి విడుదలయిన ఫలితాల్లో సందెపోగు అభిజ్ఞ ప్రతిభ చూపి జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అభిజ్ఞ ప్రస్తుతం మహాత్మా జ్యోతిరావుపూలే జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సందెపోగు అభిజ్ఞ భర్త రాజ్‌కుమార్ ఫైర్ కానిస్టేబుల్‌గా పని చేస్తూనే గ్రూప్–4లో ప్రతిభను చాటి వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు.

పాఠశాల సందర్శన

ధరూరు: మండలంలోని భీంపురం, ఎములోనిపల్లి గ్రామాల్లోని పాఠశాలను గురువారం ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడి విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, హాజరు శాతం తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.





గట్టులో..



ఉండవల్లిలో..



అలంపూర్‌లో..

సైన్స్‌తో బంగారు భవిష్యత్

సాక్షి, నెట్‌వర్క్: సైన్స్‌లో ప్రావీణ్యం సాధిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓలు, ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 28న నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాములు, అశోక్‌కుమార్, సురేష్, జీహెచ్‌ఎంలు బాలాజీ కృష్ణకుమార్, అమరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాఘవేంద్ర, సైన్స్ ఉపాధ్యాయులు రవిశంకర్, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు నర్సింహులుగౌడ్, జావేద్, బాలప్ప, అశోక్, నర్సింహులు, శ్రీరాములు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ఎల్లస్వామి, సంపత్‌కుమార్, అరవింద్, మైఖేల్, శ్రీధర్, రాధికా భాయ్, సంజీవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



మల్దకల్‌లో..



అయిజలో..

వ్యక్తిత్వ వికాసానికి ప్రతిభ పోటీలు

అలంపూర్: విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి సాంస్కృతిక పోటీలు బాటలు వేస్తాయని మండల విద్యాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో బాలోత్సవం, పిల్లల పండగ గురువారం మూడో రోజు కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా సీనియర్ విద్యార్థులకు సెల్‌ఫోన్‌తో లాభనష్టాలు, జూనియర్ విద్యార్థులకు పాఠశాల విద్య, క్రమశిక్షణ అనే అశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 38 మంది విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించే ఆసక్తి ఉండాలన్నారు. సామాజిక చైతన్యం కోసం పాటుపడుతున్న కళా సంస్థ ప్రజానాట్య మండలి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అమరేందర్‌రెడ్డి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు వెంకట్రామయ్యశెట్టి, ఉపాధ్యాయులు పార్వతమ్మ, లక్ష్మీకాంత, మనోహర్‌రెడ్డి, సురేష్‌కుమార్, మహబూసాబ్, చంద్రశేఖర్, బలగం నాగరాజు, సోమన్న, ప్రజానాట్యమండలి నాయకులు అలీ అక్బర్, ఆశన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్‌కుమార్

26న జరిగే నిరసనను జయప్రదం చేయండి

కేటీదొడ్డి: దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉన్న అప్పులన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జోగుళాంబ గద్వాల జిల్లాలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న నిరసన ను విజయవంతం చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ సూచించారు. గురువారం మండలంలోని ఎర్సందొడ్డిలో సంయుక్త కిసాన్ మోర్చా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పంటలు పండించడానికి కావాల్సిన ఉత్పత్తి ఖర్చులు తీవ్రంగా పెరిగిపోయాయి. ఎరువుల ధరలు సంవత్సరానికి పెరుగుతూనే ఉన్నాయని, రైతులకు అప్పులు ఎక్కువై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు హనుమంతు, కిష్టప్ప, నర్సప్ప, తదితరులు ఉన్నారు.



ఎర్సందొడ్డిలోని సంయుక్త కిసాన్ మోర్చా కరపత్రం విడుదల చేసిన గోపాల్

మహిళల భద్రతకు షీటీంలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో మహిళల వేధింపులపై గురువారం షీ టీం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం షీటీం ప్రత్యేకంగా పని చేస్తుందన్నారు. వేధింపులకు గురి చేసే వారి సమాచారం ఇస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్య అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను, పోక్సో కేసుల నమోదు, మహిళలు, బాలికలు సురక్షితంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేధింపులకు గురైనప్పుడు షీ టీం సభ్యులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థినులను వేధింపులకు గురి చేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాప్‌లు, నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా మహిళలను, అమ్మాయిలను వేధిస్తే షీటీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 87126 70312కు లేదా డయల్ 100కు కాల్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు దివ్యవాణి, లోకేశ్వరి, శేషన్న, హన్మంతు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఉచిత వైద్య శిబిరం



అయిజ: గుడ్ లైఫ్ వారి సహకారంతో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్యాం గుంటి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 20ఏళ్లుగా మురికివాడలు, మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేశ్వరి, శ్వేత, అంజిరెడ్డి, పవన్, ఆర్గనైజర్ జాన్సన్, సభ్యులు యుగేంధర్, శ్యాం బాబు, మహేష్, అశోక్, అనిల్, సుజిత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

మానవపాడు: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు రాఘవేంద్ర, సవిత, ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఎత్తు, బరువు, కంటి, రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు అన్నం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రుమానా, పర్వీన్, రమేశ్వర్‌రెడ్డి, శ్రీలేఖ, అలియాతబుసుమ్, సిబ్బంది దేవమ్మ, గిడ్డమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలి

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు సొంతంగానే ప్రార్థన చేశారు. ఇది చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల సమయాన్ని పాటించడం లేదని మండిపడ్డారు. మూడు రోజులుగా ఉపాధ్యాయులు లేకుండానే విద్యార్థులు ప్రార్థన నిర్వహించారని సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. ఈవిషయంపై ఎంఈఓ రాములును వివరణ కోరగా.. పాఠశాలలో మొత్తం 7 తరగతులు ఉండగా.. 127 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతిరోజు సుమారు 120 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరవుతారన్నారు. పాఠశాలకు ఆలస్యంగా వెళ్లిన ఉపాధ్యాయులు రవీంద్ర, శభాన కు నోటీసులు జారీ చేశామని ఎంఈఓ తెలిపారు. ఉపాధ్యాయులు ఇచ్చిన వివరణను పరిశీలించి, విచారణ చేపడుతామని, అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



ఉపాధ్యాయులు లేకుండా ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి

గట్టు: ఎరువుల విక్రయ దుకాణాదారులు ఎరువుల బస్తాపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి హెచ్చరించారు. గురువారం గట్టులోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎరువుల విక్రయ దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ముడి సరుకు ధరలు పెరిగి ఉత్పత్తి తగ్గిపోవడంతో డీఏపీ కొరత ఏర్పడినట్లు తెలిపారు. డీలర్లు దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు అవసరం మేరకు డీఏపీని విక్రయించాలని కోరారు. డీఏపీలకు ప్రత్యామ్నాయంగా యాసంగి పంటలకు నానో డీఏపీ, సూటీ కాంప్లెక్స్ ఎరువులను వాడాలన్నారు. ఎరువులను దాచిపెట్టి, కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు చేయాలని కోరారు. స్టాక్ వివరాలు, ధరల వివరాలను నోటీసుపై ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ తోహిద్, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

రైతు సంబురాల నిర్వహణకు అనుమతి ఇవ్వండి



మల్దకల్: డిసెంబర్‌లో నిర్వహించే మల్దకల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రైతు సంబురాలకు అనుమతి కావాలని గురువారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మల్దకల్ జాతరలో భాగంగా రైతు సంబరాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది రైతు సంబరాలను నిర్వహించుకునేందుకు కలెక్టర్ అనుమతి కోరినట్లు వారు పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



గద్వాలలో మత్స్యకార జెండా ఎగురవేస్తున్న ముదిరాజ్‌లు



కేటీదొడ్డిలో..

గద్వాలటౌన్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గద్వాల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక రెండో రైల్వే గేటు వద్ద ఉన్న సంఘం కమ్యూనిటీ హాల్ స్థలంలో ఏర్పాటు చేసిన మత్స్యకారుల సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కబీర్‌దాస్ నర్సింహులు, నియోజకవర్గ అధ్యక్షుడు టీఎస్‌ఆర్ జగదీష్ ఆవిష్కరించారు. అనంతరం గంగమ్మతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు ముదిరాజ్‌లను బీసీ ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సంఘటితంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం నదిఅగ్రహారం, గార్లపాడు గ్రామాల్లో ఉన్న మత్స్య సహకార సంఘాలలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జనార్దన్, లక్ష్మన్న, రాములు, దడవాయి నర్సింహులు, పాండు, శ్రీనివాసులు, రఘు, చిరు, చిన్నకృష్ణ, రామకృష్ణ, అంజి, నంబర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మత్స్యకారుల ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు అధికారులు ప్రయత్నించాలని మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నందిన్నెలో మత్స్యకారుల జెండాను ఎగురవేసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడాలి

ధరూరు: నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే అవకాశం ఉంటుందని మండల ఐకేపీ ఏపీఎం సంధ్యారాణి అన్నారు. మహిళా సంఘాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండలంలోని మార్లబీడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల పెళ్లి అయి సంఘంలో లేని మహిళలకు బొట్టు పెట్టి.. పూలు అందజేసి సంఘంలో చేరాలని కోరారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు, అలాగే వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు జయరాజ్, రాములు తదితర పాల్గొన్నారు.



మార్లబీడులో సమావేశమైన ఐకేపీ అధికారులు

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

శాంతినగర్: ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సంతోష్ సూచించారు. ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శాంతినగర్ పట్టణంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో గురువారం రాత్రి డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యావసనాలు, సీసీ కెమెరాల ఉపయోగాల గురించి కళాబృందం ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా పోలీసుల సహాయం పొందాలన్నారు. ఘటనకు సమీపంలో ఉన్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో చేరుకుని సాయం అందిస్తారని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. కాలనీల్లో మైనర్ బాలికలను వేధిస్తే పోక్సో కేసులు నమోదు చేస్తామని, నేరం రుజువయితే నిందితులకు పడే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంతోష్

నూతన భవనం నిర్మించండి



శిథిలమైన పాఠశాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైందని, నూతన భవనం నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ నాయకులు గుంతరామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనున్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల భవనాన్ని 85 ఏళ్ల క్రితం నిర్మించారని, ఇది పూర్తిగా శిథిలమయ్యిందని, ఇప్పటికీ అదే భవనంలో ప్రభుత్వం పాఠశాలను నిర్వహిస్తున్నారని వాపోయారు. పాఠశాల గోడలు నెర్రలు బారాయని, పైకప్పు పెచ్చులూడిపడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ పాఠశాలకు హాజరవుతున్నారన్నారు. వెంటనే పాఠశాలను సురక్షితమైన భవనంలోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, బూత్ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

విజయం కోసం పోరాడాలి

గట్టు: విజయం కోసం ప్రతి జట్టు చివరి దాకా పోరాడాలని మాజీ సర్పంచ్ ధనలక్ష్మి క్రీడాకారులకు సూచించారు. గురువారం గట్టులో భవానీమాత జాతర సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనాథ్, యశ్వంత్, నాగరాజు, చంద్రశేఖర్, దేవన్న, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

ఎర్రవల్లి: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ స్వాతి కథనం మేరకు వివరాలు ఇలా.. బోరవెల్లి గ్రామానికి చెందిన చాకలి రేవతి కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు బంధువుల ఇళ్లలో ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. భర్త చాకలి నరేష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు తప్పనిసరి

శాంతినగర్: పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలను ప్రభుత్వం ఉచితంగా చేసేందుకు అవకాశం కల్పించిందని, ప్రతి రైతు తమ పశువులకు చేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ యూఆర్.రమేష్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామంలో శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం గురువారం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఆయన పరిశీలించి అనంతరం పాడి పశువుల యజమానులతో మాట్లాడారు. ఛూడి కట్టని పశువులకు వైద్య పరీక్షలు చేయించాలని, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఎదకు వచ్చేలా చేస్తారన్నారు. అంతేగాక లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం తెచ్చిన వీర్యం ద్వారా 90 శాతం వరకు ఆడ దూడలు పుట్టే అవకాశం వుంటుందని, పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి పశుసంపద వృద్ధి చేసుకునేందుకు ఉచితంగా అందజేస్తున్న అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలను, పశుగ్రాస క్షేత్రాలను సిబ్బందితో కలిసి ఆయన పర్యవేక్షించారు.

మొక్క మొక్కకు బిందెతో నీరు

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి కంచుపాడు గ్రామానికి వచ్చే మార్గంలో మొక్కలు పెరగడానికి వన సేవకుడు బిందెలతో నీటిని తీసుకొచ్చి మొక్క మొక్కకు పోస్తున్నారు. గ్రామ పంచాయతీలో ట్యాంకర్ పగిలిపోయిందని, ట్రాక్టర్‌కు డ్రైవర్ సైతం విధులకు హాజర కావడం లేదన్నారు. ట్యాంకర్ లేకపోవడంతో వన సేవకులు నాలుగు ప్రధాన రోడ్ల వెంట ఉన్న మొక్కలను రక్షించేందుకు బిందెలతో నీటిని మోస్తున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో గురువారం గణపతి, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, అచలగురు పీర్దాసు గురుస్వాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు ఉదయం విగ్రహాలకు పంచామృతాభిషేకం, యంత్రస్థాపనం, విగ్రహ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.